క్లుప్తంగా

నేడు మంత్రి పొన్నం ప్రభాకర్ పర్యటన

హుస్నాబాద్: హుస్నాబాద్ నియోజకవర్గంలో శనివారం రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పర్యటించనున్నారు. ఉదయం చిగురుమామిడి మండలం సుందరగిరిలో ముక్కోటి ఏకాదశి సందర్భంగా వెంకటేశ్వర ఆలయం, ముల్కనూర్‌లో ఆలయాల్లో దర్శనం చేసుకుంటారు. భీమదేవరపల్లి మండలంలోని వంగరలో మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు వర్ధంతి కార్యక్రమానికి హాజరవుతారు. ఉదయం 11 గంటలకు హుస్నాబాద్ పట్టణంలోని లక్ష్మి గార్డెన్‌లో నిర్వహించే క్రిస్మస్ వేడుకల్లో పాల్గొంటారని మంత్రి కార్యాలయం నుంచి ప్రకటన విడుదల చేశారు.

'డబుల్' ఇళ్ల నిర్మాణం పూర్తి చేయండి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న లబ్ధిదారులు

హుస్నాబాద్: పట్టణంలో పెండింగ్‌లో ఉన్న డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణ పనులు పూర్తి చేయించాలని కోరుతూ లబ్ధిదారులు శుక్రవారం తహసీల్దార్ రవీందర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఇంటి అద్దె కట్టలేక ఆర్థికంగా అవస్థలు పడుతున్నామని తెలిపారు. కొత్తగా వచ్చిన ప్రభుత్వం వెంటనే పెండింగ్‌లో ఉన్న ఇళ్ల నిర్మాణాలకు నిధులు కేటాయించి ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకుడు అయిలేని మల్లికార్జున్ రెడ్డి, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

బాలాజీ ఆలయం అద్భుతం



గోశాల పనులను పరిశీలిస్తున్న శివకుమార్

దుబ్బాక: పట్టణంలోని బాలాజీ ఆలయం రాష్ట్రంలోనే గొప్ప పుణ్య క్షేత్రంగా విరజిల్లుతోందని యుగ తులసి ఫౌండేషన్ చైర్మన్, టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు కొలిశెట్టి శివకుమార్ అన్నారు. శుక్రవారం దేవాలయంలో నూతనంగా నిర్మిస్తున్న గోశాలను ఆయన సందర్శించారు. తెలంగాణ తిరుపతిగా ప్రసిద్ధిగాంచిన దుబ్బాక బాలాజీ ఆలయం అద్భుతంగా ఉందని కొనియాడారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ వడ్లకొండ శ్రీధర్, తదితరులున్నారు.

చికిత్స పొందుతూ చిన్నారి మృతి

నంగునూరు(సిద్దిపేట): ట్రాక్టర్ బోల్తా పడి గాయపడిన చిన్నారి చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందింది. రాజగోపాల్‌పేట హెడ్ కానిస్టేబుల్ రంగారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీలోని నెల్లూరు జిల్లా ఆత్మకూర్ మండలం ఏసుపేటకు చెందిన యాటగిరి లచ్చుమయ్య, భార్య కాంచమ్మతో పాటు మరో రెండు కుటుంబాలు కోహెడ మండలం బస్వాపూర్‌లో నివాసం ఉంటూ కూలీ పనులు చేస్తున్నారు. మూడు రోజుల క్రితం ట్రాక్టర్‌లో గుడిసెకు సంబంధించిన కర్రలు, సామగ్రితో వస్తున్న క్రమంలో నంగునూరు వద్ద ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తా పడడంతో వారి కూతురు అంకమ్మ (8) తీవ్రంగా గాయపడింది. గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందింది. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

విద్యార్థులు కష్టపడి చదవాలి

తొగుట(దుబ్బాక): విద్యార్థులు కష్టపడి చదువుకుని ఉన్నతస్థాయికి ఎదగాలని రిటైర్డ్ హెచ్‌ఎం ఎన్నవెళ్లి రాజమౌళి అన్నారు. మండలంలోని ఘనపురం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు శుక్రవారం తన పుట్టిన రోజు సందర్భంగా స్లేట్స్, నోట్ బుక్‌లు, పెన్నులతో పాటు స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తాను 314 పాఠశాలల్లో విద్యార్థులకు కథలు, పాటాలు, పద్యాలతో కూడిన బోధన చేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సుధాకర్, ఉపాధ్యాయులు రజిత, వనజ, వెంకటేశ్వర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

మనస్తాపంతో యువకుడు ఆత్మహత్య

సిద్దిపేటఅర్బన్: ప్రేమ విఫలం కావడంతో మనస్తాపం చెందిన యువకుడు తనువు చాలించాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొండపాక మండలం సిర్సనగండ్ల గ్రామానికి చెందిన మంతూరి సురేష్ (22) ఎలక్ట్రీషియన్‌గా పని చేస్తుంటాడు. అతను ఒక అమ్మాయిని ఇష్టపడగా అందుకు ఆమె ఒప్పుకోలేదు. దీంతో మనస్తాపానికి గురై సిద్దిపేట అర్బన్ మండలం బూరుగుపల్లి శివారులోని తాటి వనం సమీపంలో గురువారం మధ్యాహ్నం పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయాన్ని మృతుడు తన బాబాయికి ఫోన్ చేసి చెప్పగా వారు లొకేషన్ ఆధారంగా అక్కడికి చేరుకొని సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. మృతుడి బాబాయి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా గణిత దినోత్సవం

జాతీయ గణిత దినోత్సవాన్ని జిల్లావ్యాప్తంగా శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా గణిత సంబంధ కృత్యాలతో కూడిన నాటక ప్రదర్శన, పవర్‌పాయింట్ ప్రజెంటేషన్, క్విజ్ పోటీలు నిర్వహించారు. విద్యార్థులు గణిత ప్రాధాన్యం చాటుతూ ఆయా పోటీల్లో ప్రతిభ చాటారు. గణిత అంశాలతో కూడిన ఎగ్జిబిట్లు ఆకట్టుకున్నాయి. పలు పాఠశాలల్లో గణిత అధ్యాపకులను సన్మానించారు.

\- సాక్షి నెట్‌వర్క్



హుస్నాబాద్: సరస్వతి శిశు మందిర్‌లో గణిత నమూనాలు ప్రదర్శిస్తున్న విద్యార్థులు



దుబ్బాక: సాంఘిక సంక్షేమ బాలుర గురుకులంలో 1729 ఆకారంలో విద్యార్థులు



వర్గల్ నవోదయలో ఎగ్జిబిట్లు తిలకిస్తున్న విద్యార్థులు



మిరుదొడ్డి: కొండాపూర్‌లో..



కొండపాక: ఖమ్మంపల్లి హైస్కూల్‌లో..



దుబ్బాక బాలాజీ ఆలయం

'ముక్కోటి'కి ఏర్పాట్లు

దుబ్బాకటౌన్/నంగునూరు/కొండపాక: తెలంగాణ తిరుమలగా ప్రసిద్ధిగాంచిన దుబ్బాక బాలాజీ ఆలయం ముక్కోటి ఏకాదశికి ముస్తాబైంది. పట్టణంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో కొలువైన పద్మావతి సహిత వెంకటేశ్వరస్వామిని దర్శించుకునేందుకు రాష్ట్రం నుంచే కాకుండా వివిధ రాష్ట్రాల నుంచి భక్తులు తరలివస్తున్నారు. ముక్కోటి ఏకాదశి సందర్భంగా 20 వేలకు పైగా భక్తులు తరలివస్తారని ఆలయ కమిటీ చైర్మన్ వడ్లకొండ శ్రీధర్ తెలిపారు. ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డితో పాటు రాష్ట్రంలోని పలువురు ప్రముఖులు హాజరుకానున్నారు. అలాగే నంగునూరు, పాలమాకుల, కోనాయిపల్లి వేంకటేశ్వరాలయాల్లో ఉత్తర ద్వార దర్శనానికి ఏర్పాట్లు పూర్తి చేశారు. తెల్లవారుజామున స్వామివారి ఉత్సవ విగ్రహాలను పల్లకిలో ఊరేగించి ఉదయం 5 గంటలకు ఉత్తర ద్వారం తెరుస్తామని ఆయల కమిటీ సభ్యులు తెలిపారు. కొండపాక, కుకునూరుపల్లి మండలాల్లోని పలు గ్రామాల్లో దేవాలయాలను అత్యంత సుందరంగా ముస్తాబు చేశారు.



ఆలయంలో కొలువైన వెంకటేశ్వరస్వామి

సమస్యలను సత్వరమే పరిష్కరించాలి

ఎంపీపీ గంగాధరి సంధ్య

దౌల్తాబాద్(దుబ్బాక): ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యం వహించకుండా సత్వరమే పరిష్కరించాలని ఎంపీపీ గంగాధరి సంధ్య అన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముందుగా ఆయాశాఖల అధికారులు తమ నివేదికలను చదివి వినిపించారు. ఈసందర్భంగా సభ్యులు మాట్లాడుతూ.. ప్రాజెక్టుల కాలువలు పూర్తి చేసి చెరువులు, కుంటల్లోకి నీటిని వదిలి వ్యవసాయ పంటలకు జీవం పోయాలని ఇరిగేషన్ అధికారులను కోరారు. వ్యవసాయ పొలాల్లో కిందకు వేలాడుతున్న విద్యుత్ తీగలను సరి చేసి అవసరమైన చోట స్తంభాలు ఏర్పాటు చేయాలని కోరారు. చాలా వరకు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని త్వరగా వచ్చే విధంగా అధికారులు చొరవ చూపాలన్నారు. కరోనా జాగ్రత్తలు పాటించాలని వైద్యాధికారులు సభలో తెలిపారు. అంగన్‌వాడీ సెంటర్లను అధికారులు పర్యవేక్షించాలని ప్రజాప్రతినిధులు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రాజేష్‌కుమార్, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు రహీమొద్దీన్, పీఏసీఎస్ చైర్మన్ వెంకటరెడ్డి, వ్యవసాయాధికారి గోవిందరాజులు, ఎంఈఓ నర్సవ్వ, విద్యుత్ ఏఈ వాసుదేవరావు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ సంధ్య

కరోనాపై అవగాహన

హుస్నాబాద్‌రూరల్: కరోనా వైరస్ మళ్లీ వ్యాపిస్తుండడంతో వైద్య సిబ్బంది గ్రామాల్లో జ్వరం, జలుబు వచ్చిన వారిని గుర్తించి వైద్య సహాయం అందిస్తున్నారు. శుక్రవారం పందిల్లలో ఆశ కార్యకర్త పంచాయతీ సిబ్బందితో కలిసి ఇంటింటా అవగాహన కల్పించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, మాస్కులు ధరించి కరోనా భారిన పడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ తోడేటి రమేశ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



కాంగ్రెస్ నాయకుల నిరసన



కొమురవెల్లిలో ధర్నా చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కొమురవెల్లి(సిద్దిపేట)/మద్దూరు(హుస్నాబాద్): పార్లమెంట్‌లో ప్రతిపక్ష ఎంపీలను సస్పెండ్ చేయడాన్ని నిరసిస్తూ మండల కేంద్రంలో శుక్రవారం కాంగ్రెస్ నాయకులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ.. నియంతృత్వ విధానాలను అవలంభిస్తున్న బీజేపీ ప్రభుత్వానికి ప్రజలు త్వరలోనే బుద్ధి చెబుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో మహాదేవుని శ్రీనివాస్, కనుకరాజు, సనాది భాస్కర్, చెరుకు రమణారెడ్డి, వల్లాద్రి అంజిరెడ్డి, ఉప్పల వంశీ, గంగుల అయిలయ్య తదితరులు పాల్గొన్నారు. అలాగే మద్దూరు, దూల్మిట్ట మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం ఎదుట కాంగ్రెస్ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా మాజీ పీఏసీఎస్ వైస్ చైర్మన్ కామిడి జీవన్‌రెడ్డి మాట్లాడుతూ.. పార్లమెంట్‌లో భద్రత వైఫల్యాలపై నిలదీస్తే సస్పెండ్ చేయడం ఏమిటని ప్రశ్నించారు. కార్యక్రమంలో నాయకులు మ్యాక మల్లేశం, శ్రీధర్‌రెడ్డి, రమణారెడ్డి, ఎండీ. షౌకత్, ఉప్పలయ్య, కనుకయ్య, శ్రీను, రాజు, రాములు తదితరులు పాల్గొన్నారు.



మద్దూరులో..

అన్ని మతాలకు సమ ప్రాధాన్యం

దుబ్బాకటౌన్: అన్ని మతాలకు సమ ప్రాధాన్యం ఇస్తూ అందరం కలిసిమెలిసి అన్ని పండగలు సంతోషంగా జరుపుకుంటామని దుబ్బాక మున్సిపల్ చైర్‌పర్సన్ గన్నె వనిత అన్నారు. శుక్రవారం ప్రభుత్వం ఆధ్వర్యంలో సిద్దిపేట ఆర్డీఓ రమేష్‌బాబు ఆధ్వర్యంలో ముందస్తుగా క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఈసందర్భంగా క్రైస్తవులకు ప్రభుత్వం తరఫున కానుకలు అందించారు. అనంతరం లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కొత్త పుష్పలత కిషన్‌రెడ్డి, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.



క్రిస్మస్ కానుకలు అందిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ వనిత తదితరులు

నిధులు మంజూరు చేయండి

అక్కన్నపేట(హుస్నాబాద్): రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్‌ను శుక్రవారం హైదరాబాద్‌లోని తన నివాసంలో రామవరం మాజీ సర్పంచ్ బుర్ర ప్రభాకర్, మహేందర్‌రెడ్డి, నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా మండలంలోని రామవరం నుంచి తోర్నాల, పోతారం(జే), శివాలితండా వరకు నూతన రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేసేందుకు కృషి చేయాలన్నారు. అదేవిధంగా గ్రామాభివృద్ధికి సహకరించాలని కోరారు.



మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్‌ను సన్మానిస్తున్న నాయకులు

వ్యక్తిపై కేసు

అక్కన్నపేట(హుస్నాబాద్): అక్రమంగా అన్న ఇల్లును తమ్ముడు కూల్చిన సంఘటనలో తమ్ముడిపై కేసు నమోదైంది. ఎస్సై వివేక్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని చౌటపల్లికి చెందిన దూబల జగ్గయ్య అలియాస్ జగన్ రిటైర్డ్ ఉద్యోగి. ప్రస్తుతం హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నాడు. అతడి తమ్ముడు దూబల సింగరయ్యతో భూమి పంచాయతీ విషయమై ప్రస్తుతం కోర్టులో కేసు నడుస్తోంది. ఈ నేపథ్యంలో గురువారం రాత్రి పాత కక్షలను మనసులో పెట్టుకొని తన తమ్ముడు సింగరయ్య తన ఇల్లును కుల్చాడని.. తద్వారా సుమారుగా రూ. 2 లక్షల నష్టం వాటిల్లిందని ఫిర్యాదు చేశారడు. జగన్ ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

అతిగా మద్యం తాగి వ్యక్తి మృతి

చేర్యాల(సిద్దిపేట): అతిగా మద్యం తాగి వ్యక్తి మృతిచెందిన సంఘటన పట్టణ కేంద్రంలో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొమురంభీం జిల్లా కాగజ్‌నగర్‌కు చెందిన గాజుల కొండయ్య (42) కొన్నేళ్లుగా జాతర సమయంలో కొమురవెల్లిలోని ఓ హోటల్‌లో పనిచేసేందుకు వచ్చేవాడు. ఈ క్రమంలో ఈనెల 15న కొమురవెల్లికి వెళుతున్నానని ఇంట్లో చెప్పి వచ్చాడు. కానీ హోటల్‌కి వెళ్లలేదు. ఈ విషయాన్ని 21వ తేదీన హోటల్ వాళ్లు మృతుడి భార్యకు ఫోన్ చేసి చెప్పారు. అయితే శుక్రవారం ఉదయం పట్టణ కేంద్రంలోని గాంధీ సెంటర్ వద్ద గల ఓ వైన్ షాపు ఎదుట మరణించి ఉన్నాడన్న విషయం స్థానిక పోలీసుల ద్వారా తెలుసుకున్న మృతుడి భార్య ఉమాదేవి కాగజ్‌నగర్ నుంచి వచ్చింది. నా భర్త మృతిపై ఎలాంటి అనుమానం లేదని, అతిగా మద్యం తాగి రాత్రి సమయంలో చలి తీవ్రతతో మృతి చెంది ఉంటాడని ఫిర్యాదులో పేర్కొంది. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ దామోదర్ తెలిపారు.

నీటి ఎద్దడి నివారణకు చర్యలు

దుబ్బాకటౌన్: దుబ్బాక మున్సిపాలిటీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ చైర్‌పర్సన్ గన్నె వనిత అన్నారు. పట్టణంలోని 13వ వార్డులో నీటి ఎద్దడి నివారణకు ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి ఆదేశాల మేరకు శుక్రవారం నూతనంగా బోరు బావి వేయించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మున్సిపాలిటీలో నీటి ఎద్దడి నివారణకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ ఆస సులోచన, కో ఆప్షన్ మెంబర్ స్వామి, బీఆర్ఎస్ నాయకులు పర్స కృష్ణ, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆటోవాలాల ఆందోళన



నిరసన వ్యక్తం చేస్తున్న ఆటో డ్రైవర్లు

వర్గల్(గజ్వేల్): మండలంలోని నాచారం స్టేజీ వద్ద గజ్వేల్–తూప్రాన్ రహదారిపై శుక్రవారం ఆటోవాలాలు ఆందోళన చేశారు. మహిళలకు ఉచిత ఆర్టీసీ సౌకర్యం కల్పించడంతో తమ ఆదాయానికి గండిపడిందని వాపోయారు. ఫైనాన్స్ సంస్థలు తమను ఇబ్బందిపెట్టే అవకాశముందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆదాయం కొరవడి రోడ్డున పడ్డ తమను ప్రభుత్వం ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నాచారం, యావాపూర్, అనంతగిరిపల్లికి చెందిన ఆటోవాలాలు, తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

బెజ్జంకి(సిద్దిపేట) : మండలంలోని గాగిళ్లాపూర్ నుంచి బెజ్జంకి వైపునకు వస్తున్న అక్రమ ఇసుక రవాణా ట్రాక్టర్‌లను శుక్రవారం తహసీల్దార్ శ్యామ్ పట్టుకొని బెజ్జంకి తహసీల్దార్ కార్యాలయానికి తరలించారు. ఇసుకను సీజ్ చేసి, ట్రాక్టర్‌లకు రూ.5వేల చొప్పున జరిమానా విధించినట్లు తెలిపారు. ఇసుకను వేలం వేస్తామన్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అందజేత

సిద్దిపేటకమాన్: పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను సిద్దిపేట టూటౌన్ సీఐ రవికుమార్ సీఈఐఆర్ యాప్ ద్వారా గుర్తించి బాధితుడికి శుక్రవారం అందజేశారు. సిద్దిపేట టూటౌన్ సీఐ రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణానికి చెందిన మందపల్లి శ్రీకాంత్ ఆగస్టు 23వ తేదీన పట్టణంలో తన సెల్‌ఫోన్‌ను పోగొట్టుకున్నాడు. దీంతో అతడు సిద్దిపేట టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సీఐ రవికుమార్, సిబ్బంది సీఈఐఆర్‌తో గుర్తించి రికవరీ అనంతరం బాధితుడికి అందజేశారు.

ట్రాక్టర్ బోల్తా: వ్యక్తి దుర్మరణం

వర్గల్(గజ్వేల్): లారీని తప్పించబోయి ట్రాక్టర్ బోల్తా పడి భర్త మృతిచెందగా భార్యకు గాయాలైన సంఘటన మండలంలోని గౌరారం రాజీవ్ రహదారిపై శుక్రవారం రాత్రి జరిగింది. ఎస్ఐ విజయ్‌భాస్కర్ కథనం ప్రకారం.. ములుగు మండలం లక్ష్మక్కపల్లికి చెందిన మస్కురి నర్సింలు (45) కవిత దంపతులు. కాగా భార్య ఇటీవల తన అమ్మగారి ఇల్లు అయినా వర్గల్ మండలం పాతూరుకు వెళ్లింది. గురువారం భార్యను తీసుకరావడానికి నర్సింలు పాతూరు వెళ్లాడు. శుక్రవారం మామ నర్సయ్య, భార్య కవిత, బామ్మర్ది కృష్ణ, అతడి భార్య భవానితో కలిసి ట్రాక్టర్‌లో వడ్లు వేసుకుని గౌరారం వెళ్లారు. ఓ రైస్ మిల్లులో వడ్లు పట్టుకుని బియ్యం బస్తాలతో వస్తున్న క్రమంలో గౌరారం రాజీవ్ రహదారిపై ఎదురుగా వస్తున్న లారీని తప్పించబోయి ట్రాక్టర్ డివైడర్‌ను ఢీకొని బోల్తా పడింది. దీంతో ట్రాలీలో బియ్యం బస్తాలపై కూర్చున్న నర్సింలు రోడ్డుపై పడడంతో అతడిపై బియ్యం బస్తాలు పడి అక్కడికక్కడే మృతిచెందాడు. భార్య కవిత చేయి విరిగింది. మిగితా వారికి గాయాలయ్యాయి. ఘటన స్థలానికి పోలీసులు చేరుకుని గాయాలైన వారిని చికిత్స నిమిత్తం గజ్వేల్ తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **పీవీ రావుకు నివాళి**

బెజ్జంకి(సిద్దిపేట): దళితుల ఐక్యత కోసం కృషి చేసిన పీవీ రావు 18వ వర్ధంతిని మండలంలోని వడ్లూరులో ఆర్‌టీఐ ప్రచార కమిటీ చైర్మన్, మాల మహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాసూరి మల్లికార్జున్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఉమ్మడి ఏపీలో అప్పటి సీఎం చంద్రబాబు నాయుడు కుట్ర పూరితంగా వ్యవహరించి దళితుల మధ్య చిచ్చు పెట్టేలా వ్యవహరించారని ఆరోపించారు.

◆ **పొదుపు అలవర్చుకోవాలి**

నంగునూరు(సిద్దిపేట): ప్రతి ఒక్కరూ పొదుపు అలవర్చుకుంటే ఆపద సమయంలో ఆదుకుంటుందని పురుషుల పొదుపు సంఘం మండలాధ్యక్షుడు కడారి తిరుపతిరెడ్డి అన్నారు. మగ్దుంపూర్‌లో ఇటీవల మరణించిన సంఘం సభ్యుడు ఉగ్గి ఎల్లయ్య కుటుంబ సభ్యులకు శుక్రవారం అభయనిధి, సామూహిక నిధి, పొదుపు, బోనస్ కలిపి రూ. లక్ష ఆర్థిక సహాయం అందజేశారు.

◆ **ఓటరు జాబితా సవరించాలి**

బెజ్జంకి(సిద్దిపేట): ఒకే కుటుంబానికి చెందిన అందరికీ ఒకే బూత్‌లో ఓట్లు వచ్చేలా సవరించాలని కోరుతూ కాంగ్రెస్ సోషల్ మీడియా నాయకులు బెజ్జంకి తహసీల్దార్ శ్యాంకు శుక్రవారం వినతి పత్రం అందజేశారు. సీజన్ వ్యాపారాల కోసం తాత్కాలికంగా వచ్చిన వారి ఓట్లను తొలిగించాలని కోరారు. కార్యక్రమంలో మానాల రవి, డీవీ రావు, మెట్ట నాగరాజు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

◆ **ప్రభుత్వ పథకాలపై అవగాహన**

చిన్నకోడూరు(సిద్దిపేట): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నోడల్ అధికారి, యూనియన్ బ్యాంకు మేనేజర్ సదరం యాదవ్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని కిష్టాపూర్, చర్లఅంకిరెడ్డిపల్లి గ్రామాల్లో కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాస్, సర్పంచ్‌లు కవిత, స్వర్ణలత, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

◆ **నిత్యావసర సరుకుల పంపిణీ**

చేర్యాల(సిద్దిపేట): పట్టణ కేంద్రంలోని షాలేం ప్రార్థన మందిరంలో బ్రదర్ అందె విజయ్‌కుమార్ శుక్రవారం పాస్టర్లకు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కృపాకరం, కుమార్, ప్రభాకర్, జాన్ తదితరులు పాల్గొన్నారు.

◆ **సామూహిక సత్యనారాయణ వ్రతం**

తొగుట(దుబ్బాక): మండలంలోని లింగాపూర్‌లో వైకుంఠ ఏకాదశి సందర్భంగా శుక్రవారం సామూహిక సత్యనారాయణ వ్రతం నిర్వహించారు. గ్రామంలోని ఆంజనేయస్వామి దేవాలయ ఆవరణలో 108 జంటలతో వ్రతం నిర్వహించారు. తొగుట పీఠాధిపతి మధుసూదనానంద సరస్వతి స్వామి మాట్లాడుతూ.. చేసే పనిపై శ్రద్ధ లేకపోతే మంచి ఫలితాన్ని సాధించలేమన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ లతా నరేందర్‌రెడ్డి, సర్పంచ్ రజిత శ్రీశైలం దంపతులతో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

◆ **మార్కెట్ పాలకవర్గ సమావేశం**

దౌల్తాబాద్(దుబ్బాక): మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో శుక్రవారం మార్కెట్ కమిటీ చైర్మన్ ఇప్ప లక్ష్మి అధ్యక్షతన పాలకవర్గ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా డైరెక్టర్లతో పలు అంశాలపై చర్చించారు. మూడు నెలల నుంచి చెక్‌పోస్టులు రైస్‌మిల్లుల ద్వారా మార్కెట్ కమిటీకి వచ్చిన ఆదాయంతో సిబ్బంది జీత భత్యాలు చెల్లించినట్లు తెలిపారు.

◆ **హనుమాన్ దేవాలయ వార్షికోత్సవం**

కొండపాక(గజ్వేల్): కుకునూరుపల్లి మండలంలోని మంగోల్ హనుమాన్ దేవాలయ 9వ వార్షికోత్సవాన్ని శుక్రవారం వైభవంగా నిర్వహించారు. సర్పంచ్ పుల్లోజు కిరణ్‌కుమార్‌చారి దంపతుల ఆధ్వర్యంలో హోమం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు కనకయ్య, సాయిబాబాగౌడ్, వీరేశం, సంతోష్, అనిల్, కరుణాకర్ పాల్గొన్నారు.

◆ **డ్రంకెన్ డ్రైవ్‌లో జైలుశిక్ష**

వర్గల్(గజ్వేల్): మద్యం సేవించి బైక్ నడిపిన వ్యక్తికి గజ్వేల్ కోర్టు న్యాయమూర్తి ప్రియాంక శుక్రవారం రెండు రోజుల జైలుశిక్ష విధించారని వర్గల్ మండలం గౌరారం ఎస్సై విజయభాస్కర్ తెలిపారు. శేరిపల్లికి చెందిన గొలనుకొండ సత్యనారాయణ మద్యం సేవించి బైక్ నడపగా, కేసు నమోదు చేసి న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచినట్లు పేర్కొన్నారు. శుక్రవారం న్యాయమూర్తి అతనికి రెండు రోజుల జైలు శిక్ష విధించినట్లు తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

◆ **పరామర్శ**

నంగునూరు(సిద్దిపేట): బీఆర్ఎస్ పాలమాకుల గ్రామశాఖ అధ్యక్షుడు వర్దోలు వెంకట్ తల్లి లచ్చవ్వ ఇటీవల మరణించడంతో మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు శుక్రవారం ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన వెంట సారయ్య, శ్రీకాంత్ రెడ్డి, సోమిరెడ్డి, భూపేశ్, కుమారస్వామి, రవీందర్ రెడ్డి, పరమేశ్వర్, వేణుచక్రవర్తి, కనుకరాజు, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.